ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


ఉష్ణోగ్రత: గరిష్ఠం 35.0 కనిష్ఠం 23.0



ఘనంగా రంజాన్



వికారాబాద్: శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



వికారాబాద్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మేడ్చల్‌టౌన్: మేడ్చల్ పట్టణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





తాండూరు: ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- కిక్కిరిసిన ఈద్గాలు, మసీదులు
- సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు
- పకడ్బందీగా పోలీసుల బందోబస్తు
- ప్రార్థనలకు హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం రంజాన్ పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గాలు, మసీదులకు వెళ్లి సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు పండగ విశిష్టతను వివరించారు. పలు చోట్ల జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వికారాబాద్ పరిధిలోని ఆలం షాషి ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్.. తాండూరులోని ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి 31

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కొడంగల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్తలు, పురోహితులు స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామివారిని మాడ వీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవాలకు కొడంగల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

రెచ్చిపోతున్న
మట్టి మాఫియా
అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి, నాపరాయి తరలింపు
అడ్డుకుంటున్న వారిపై దాడులు
తాండూరులో భద్రత లేదంటున్న ఉద్యోగులు
7

ఓటు నమోదుకు వేళాయె!

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. గతంలో ఓటరు నమోదుకు ఏడాదికి ఒక్కసారి మాత్రమే అవకాశం ఉండేది. కాగా, ఎన్నికల సంఘం ఏడాదిలో నాలుగు పర్యాయాలు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడుతోంది. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో నమోదు చేసుకునేందుకు కొత్త ఓటర్లకు అవకాశం కల్పించింది. అయితే ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు నేటి నుంచి అవకాశం కల్పించారు.



- మార్పులు, చేర్పులు, సవరణలకూ అవకాశం
- ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఏడాదికి నాలుగు పర్యాయాలు ఓటు నమోదుకు అవకాశం
- 'స్థానిక' ఎన్నికలకు పెరగనున్న ఓటర్ల సంఖ్య

వికారాబాద్ జిల్లా ఓటర్లు (2025, జనవరి 6వరకు)

నియోజకవర్గం	ఓటర్లు
పరిగి	2,71,060
వికారాబాద్	2,34,933
తాండూరు	2,47,783
కొడంగల్	2,46,526
మొత్తం	10,00,302

మేడ్చల్ జిల్లా

మేడ్చల్	6,72,376
మల్కాజిగిరి	5,13,114
కుత్బుల్లాపూర్	7,34,051
కూకట్‌పల్లి	4,86,049
ఉప్పల్	5,42,947
మొత్తం	29,48,537

వికారాబాద్/మేడ్చల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటర్ల నమోదనేది నిరంతర ప్రక్రియగా కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. బీఎల్‌వోల వద్ద లభించే దరఖాస్తుల ద్వారా లేదా ఆన్‌లైన్‌లోనైనా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని ఇటీవల వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో సూచించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, ఓటర్ల బదిలీ, ఓటరు గుర్తింపు కార్డులో మార్పులు, కుటుంబ సభ్యులందరూ వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధంగా మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, మునిసిపల్ ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఓటర్లు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

తప్పులు లేకుండా...

ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు


మిగతా 8వ పేజీలో...



సద్వినియోగం చేసుకోవాలి..

నేటి నుంచి ప్రారంభమవుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. జిల్లాలో ఓటరు నమోదుకు అన్ని చర్యలు చేపట్టాం.

-గౌతమ్, కలెక్టర్, మేడ్చల్





మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

ఈద్గాల అభివృద్ధికి నిధులు

» చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి

తాండూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని ఈద్గాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఈద్గా కమిటీలు, ఎంఐఎం నేత అబ్దుల్‌హది వారికి వినతిపత్రాలు సమర్పించారు. చెంగేష్‌పూర్ రోడ్డులోని ఈద్గాకు రూ.10 లక్షలు, పాత ఈద్గా మైదానానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, కరుణం పురుషోత్తంరావు , ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసం'నకు భారీ స్పందన

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్, మార్చి31(ఆంధ్రజ్యోతి): 'రాజీవ్ యువ వికాసం'పథకానికి అద్భుత స్పందన లభిస్తోందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఈ పథకం వీలైనంత ఎక్కువ మందికి చేరవేయడానికి అధికారులు కృషి చేస్తున్నారని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు పత్రిక ప్రకటనలు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో పథకానికి అర్హులైన యువత ముందుకు వచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని, అర్హులందరికీ సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ సుధీర్, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, డీపీవో జయసుధ, బీసీ అభివృద్ధి అధికారి ఉపేందర్, హనుమంతురావు, మహేశ్వర్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన కీసరగుట్ట

ఘనంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం



దర్శనానికి క్యూలో భక్తులు



పూజలు చేస్తున్న అర్చకులు

కీసర, మార్చి31(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట సోమవారం భక్తులతో కిటకిటలాడింది. భవాని శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సోమవారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యల్లో ఆలయానికి విచ్చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల తాకిడిని, స్థానికులను సమన్వయం చేసుకుంటూ ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు నల్లా మధుసూధన్‌రెడ్డి, ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

చకచకా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం!

8,475 మంది లబ్ధిదారుల ఎంపిక



కీసర మండలం బోగారంలో ప్రారంభమైన ఇంటి నిర్మాణం

- తొలిదశలో 308 ఇళ్లు మంజూరు
- పనులు ప్రారంభించిన 102 మంది
- నాలుగు దశల్లో బిల్లుల చెల్లింపు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇళ్ల నిర్మాణం కోసం జిల్లాలో 8,475 లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 1.43 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇంటి స్థలం లేని వారు సుమారు 76 వేల వరకు ఉన్నారు. మొదట ఇంటి స్థలం ఉన్న వారికి ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో దరఖాస్తుదారుల్లో 8,475 మందికి ఇంటి స్థలాలు ఉండటంతో తొలుత లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. మొదట ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రభుత్వం జనవరి 26న జిల్లాలో ఐదు గ్రామాల్లో

మిగతా 8వ పేజీలో...

నిర్మాణాలను ప్రారంభించాలి

జిల్లాలో ఎంపికైన లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా నిర్మాణం చేపడితేనే బిల్లులు వస్తాయి. 400 స్క్వేర్ ఫీట్ల నుండి 500 ఫీట్లకు మించకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలి. నాలుగు దఫాలుగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం.

-రమణమూర్తి, హౌజింగ్ పీడీ

ప్రజల కోసమే ప్రభుత్వ నిర్ణయాలు

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పేదల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని కసిరెడ్డి తెలిపారు. విపక్షాలు కుట్ర రాజకీయలు వీడి అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, కృష్ణనాయక్, సురేందర్ రెడ్డి, మానయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడి

'హెచ్‌సీయూ భూములను అమ్మొద్దు'

ఇబ్రహీంపట్నం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ యూనివర్సిటీలో 400 ఎకరాల అటవీ భూములను వేలం వేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పనులకు అడ్డుపడిన విద్యార్థులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

వడదెబ్బ.. జాగ్రత్తలే రక్ష

● ఎండలో తిరగకుండా చూసుకోవాలి
: డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు



షాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో మధ్యాహ్న సమయంలో బయట తిరిగే వారు వడ దెబ్బ బారిన పడుతున్నారు. వడ దెబ్బ ఒక్కోసారి ప్రాణాలపైకి తెస్తుంది. వడ దెబ్బ నివారణ చర్యలు, తగిలాక అందించాల్సిన చికిత్స గురించి చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేంద్రబాబు చేసిన సూచనలివీ..

వడదెబ్బ: మండుటెండలో ఎక్కువ సేపు వృత్తిపరమైన కూలీ పనులు చేసే వారు, అత్యవసర పనులపై బయటకు వెళ్లేవారిలో చాలా మంది వడదెబ్బ బారిన పడుతుంటారు. వారి శరీర ఉష్ణోగ్రత 105 ఫారన్ హీట్‌కు మించడంతో పాటు నీరసించడం, సొమ్మసిల్లి పడిపోవడాన్నే వడదెబ్బ అంటారు.

సన్‌స్ట్రోక్ లక్షణాలు : శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల ఫారన్ హీట్, అంత కంటే ఎక్కువకు చేరడం. అయోమయమైన స్థితి, నీరసించిపోవడం, చర్మం పొడిబారడం, నాడి ఎక్కువగా కొట్టుకోవడం, అపస్మారక స్థితి, మాటలు తడబడడం, శ్వాసక్రియ ఎక్కువవడం ఉంటాయి.

కారణాలు: ఎక్కువ సేపు ఎండలో పనులు చేయడం, తిరగడం. నీరు తక్కువగా తాగడం. ద్రవ పదార్థ ఆహారాన్ని సరిగా తీసుకోకపోవడం. మత్తుపానీయాలు ఎక్కువగా సేవించడం. చిన్న పిల్లలు ఎక్కువ సేపు ఎండలో ఆడుకోవడం వంటి వాటితో వడదెబ్బ సోకుతుంది.

నివారణ: సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, లేదా గొడుగు, తలపాగ ధరంచాలి. చలువ కళ్లద్దాలు ధరించాలి. వదులుగా ఉండే తెల్లని దుస్తులు వేసుకోవాలి. నీరు, ద్రవపదార్థాలు(కొబ్బరి నీరు, మజ్జిగ, అంబలి) ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్ ద్రవాన్ని తీసుకోవాలి. ఆహారాన్ని తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తీసుకోవాలి. నీడలో గడపాలి. ఇంట్లో ఉష్ణోగ్రత తగ్గేలా కిటికీలు, తలుపులకు తెరలను లేదా చాపలను కట్టుకోవాలి. శరీరానికి చెమట ఎక్కువగా పడుతుంది కాబట్టి సాయంత్రం వేళ స్నానం తప్పకుండా చేయాలి.

చేయకూడనివి..

నల్లని వస్త్రాలు ధరించకూడదు. మత్తుపానీయాలు సేవించకూడదు. టీ, కాఫీలను తక్కువ చేయాలి. ఎండలో ఎక్కువ తిరగొద్దు.

చికిత్స : వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడగా ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి ఇతర సపర్యలు చేయాలి.

- శరీర ఉష్ణోగ్రత తగ్గడానికి తడిగుడ్డతో పలుమార్లు తుడవాలి.
- నీరు ద్రవపదార్థాలు, పండ్ల రసాలు తాగాలి.
- ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంత అద్దితే చాలా మంచిది. అపస్మారక స్థితికి వెళ్తే ఐవీ సెలైన్ ఎక్కించాలి.
- రోగి నాడి, బీపీ, శరీర ఉష్ణోగ్రతలను తరచూ జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రిలో చేర్పించాలి.


గ్రామస్తులకు అంబలి పంపిణీ చేస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

యాలాలలో అంబలి పంపిణీ

యాలాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): యాలాల మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేందర్‌రెడ్డి సోమవారం రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబ, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, ఉపాధ్యక్షుడు మోహి జ్, కార్యదర్శి హైమద్ పాల్గొన్నారు.

విద్యార్థినుల సేవా కార్యక్రమాలు అభినందనీయం


సుభాన్‌పూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

మహేశ్వరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటనమస్) కళాశాల-హైదరాబాద్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని సుభాన్‌పూర్‌లో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు సోమవారం ఐదో రోజుకు చేరాయి. గ్రామంలో విద్యార్థినులు పచ్చదనం పరిశుభ్రత, ఓటు ప్రాధాన్యం, ఉద్యోగాల సాధన, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం తదితరాంశాలపై ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే విద్య, ఉపాధి లేని లేని యువత వివరాలు సర్వే చేసి తెలుసుకున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింహులు మాట్లాడుతూ.. విద్యార్థునులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం మంచి పరిణామం అన్నారు. మాజీ సర్పంచ్ పద్మపాండు మాట్లాడుతూ.. హైదరాబాద్ విద్యార్థినులు గ్రామంలో సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యార్థినులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రోగ్రాం అధికారులు జి.నర్సింహులు, ఎం.మధుకర్‌రావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు తధితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని బిందెం గడ్డ తండాలో రూ.5లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీలోని ప్రతాప్‌సింగారం గుబ్బరిగుట్ట మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ఆవరణలో జరిగిన గణపతి హోమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గోపూజ, అభిషేకం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్, పీసీబీ సభ్యుడు మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

దుద్యాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లిలోని తంగెళ్లగడ్డ వీధిలో సోమవారం మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రుద్రహోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

















కుర్మిద్దలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆర్సీలు, డ్రైవింగ్ పత్రాలు వెంట తప్పనిసరి

యాచారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనాదారుడు ఆర్సీలు, డ్రైవింగ్ పత్రాలు, బీమా పత్రాలు వెంట పెట్టుకోవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు సూచించారు. సోమవారం సాయంత్రం కుర్మిద్దలో వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోలు ఇతర వాహనాలు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని చెప్పారు.



నెహ్రూ యువ కేంద్రానికి ఎంపికైన అనురాగ్ విద్యార్థులు

ఎన్‌వైకేకు అనురాగ్ విద్యార్థుల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌కు అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. వెంకటాపూర్‌లోని యూనివర్సిటీలో జిల్లా స్థాయి నెహ్రూ యువకేంద్ర సంఘటన్, వికసిత్ భారత్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 13 జిల్లాల నుంచి 130 మంది విద్యార్థులు, వలంటీర్లు హాజరయ్యారు. ఎన్‌వైకే సంఘటన్ డైరెక్టర్ ఖుష్బూ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజ సేవలో పాల్గొని దేశాభివృద్ధి పాటుపడాలని సూచించారు. మంచి పౌరులుగా ఎదగాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ సీఈవో నీలిమ, ప్రొఫెసర్లు ముత్తారెడ్డి, శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సి.మల్లేష్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సత్కరిస్తున్న శ్రీశైలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

యాచారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ మండలంలో పర్యటించి పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర బీజేవైఎం లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం సోమవారం ఆయనను కలిసి శాలువాలతో సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కరువు పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం మండల బీజేపీ అధ్యక్షుడు యాదీష్, జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

బహుజన పాలనే బీఎస్పీ ధ్యేయం

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేస్తోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న అన్నారు. అధికారం ఆధిపత్య వర్గాల చేతుల్లో ఉన్నంత కాలం బహుజనులు పథకాల కోసం ఎదురుచూడక తప్పదన్నారు. ఏప్రిల్ 26న నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఎస్పీ నిర్వహించే మహనీయుల జాతర కరపత్రాలు, పోస్టర్లను సోమవారం నాగన్న ఆవిష్కరించారు. మహనీయుల జాతరకు ఎంపీ, బీఎస్పీ నేషనల్ కో-ఆర్డినేటర్ రాంజీ గౌతమ్ రాబోతున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ ధనుంజయ, అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుధాకర్, నాయకులు పథ్వీరాజ్, రాంచందర్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

షాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. కేసారంలో ఎస్‌డీఎఫ్ రూ.5లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనపై దృషిపెట్టాని, గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, ప్రధానకార్యదర్శి సంతోష్, నాయకులు రాంచందర్, శ్రీరాంరెడ్డి, తిరుపతిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి, నాపరాయి తరలింపు

- అడ్డుకుంటున్న వారిపై దాడులు
- తాండూరు నియోజకవర్గంలో భద్రత లేదంటున్న ఉద్యోగులు
- మహిళా అధికారికి తీవ్ర బెదిరింపులు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు(ఫైల్)

తాండూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలో ఇసుక, ఎర్ర మట్టి, రాయల్టీ మాఫియాలు రెచ్చిపోతున్నాయి. అక్రమాలను అడ్డుకుంటే దాడులు సైతం చేస్తున్నారు. ఇందుకు తాజా సంఘటనలే నిదర్శనం. అడ్డుకునే అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చెప్పింది వినకుంటే ఏం చేయాలో అదే చేస్తామని బెదిరిస్తున్నారు. దాడులకు ఈ మాఫియా బృందాలను సైతం ఏర్పాటు చేసుకున్నట్టు చెబుతున్నారు. తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లిలోని కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఫిరంగి జర్నప్ప 100 డయల్ చేసి కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ విఠల్‌రెడ్డి మార్చి 21న అర్ధరాత్రిన తన సిబ్బందితో నది వద్దకు చేరుకొని ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక నింపిన రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు సమాచారం ఇచ్చాడని ఓ మాజీ సర్పంచ్ గ్యాంగ్ గత నెల 21న జర్నప్పపై దాడి చేశాడని చెబుతున్నారు. అక్రమార్కులు అర్ధరాత్రి గ్రామంలోకొచ్చి దాడి చేయడంపై స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఉదంతం గ్రామంలోని సీసీ కెమెరాల్లో రికార్డైంది. దీంతో బాధితుడు జర్నప్ప మాజీ సర్పంచ్ అనుచరులపై పోలీసు ఫిర్యాదు చేశాడు. మాజీ సర్పంచ్ భీమప్పతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని జర్నప్పే తమపై దాడిచేశాని భీమప్ప సైతం ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడ్డుకుంటే అంతు చూస్తాం!



తాండూరులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కాగ్నా, కాక్రవేణి నదుల నుంచి ఇసుక తోడుతున్నారు. ఖాంజాపూర్‌లో ఎర్ర మట్టి, కాగ్నా నుంచి ఇసుక అనుమతి లేకుండా రవాణా చేస్తున్నారు. అడ్డుకునే వారిపై దాడులకు, బెదరింపులకు పాల్పడుతున్నారు. ఈ పనులకు డబ్బు వెచ్చించి టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దాడులతో పాటు ఓవర్ స్పీడ్‌తో టిప్పర్లు, ట్రాక్టర్లు తిప్పుతూ అడ్డొస్తే గుద్ది చంపుతాం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. పోలీసులు మాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రజలంటున్నారు. రాయల్టీ కట్టకుండా తరలుతున్న లారీలను అడ్డుకున్న రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నిర్మలను ఇటీవల మాఫియా బెదిరించింది. మైన్స్ సహాయ సంచాలకు(అసిస్టెండ్ డైరెక్టర్) సత్యనారాయణనూ హెచ్చరించారు. గౌతాపూర్ చెక్‌పోస్ట్ ఆఫీసర్ నిర్మల రాయల్టీ బిల్లు లేని 11 నాపరాయి లారీలను పట్టుకున్నారు. లారీ డ్రైవర్ మల్కాపూర్ అనిల్ లారీని ఆపకుండా గౌతాపూర్ నుంచి కరన్‌కోట్ మీదుగా మల్కాపూర్‌నకు పారిపోయేందుకు యత్నించగా నిర్మల లారీని అదుపులోకి తీసుకున్నారు. 'మీరు లారీని ఆపితే టైర్ల కింద నలిగిపోతారు.' అని డ్రైవర్ హెచ్చరించాడని అధికారులు తెలిపారు. పైస్థాయి ఒత్తిళ్లతో కేసు నమోదుకు అధికారులు వెనకడుగు వేశారు. మైన్స్ హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందరాజు తాండూరు వచ్చి కేసు నమోదు చేసే వరకు వదల్లేదు. కాగా ఏడాదిగా అక్రమంగా నాపరాతిని కర్ణాటకకు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇలాగే వదిలేస్తే ఈ మాఫియా మరింత రెచ్చిపోతుందని, ఉన్నతాధికారులు వెంటనే వీరిపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆమనగల్లు మార్కెట్‌కు రెవెన్యూ టార్గెట్ పూర్తి

- లక్ష్యానికి మించి రూ.10లక్షల ఆదాయం
- మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు లక్ష్యానికి మించి ఆదాయాన్ని ఆర్జించిందని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ తెలిపారు. మార్కెట్ డైరెక్టర్లు, అధికారుల కృషితో లక్ష్యాలను అధిగమించామన్నారు. మార్కెట్ యార్డ్‌లో సోమవారం మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ జి.భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2024-25కు ఆమనగల్లు ఏఎంసీకి రూ.3.14కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. కాగా రూ.3.24కోట్ల రెవెన్యూ వచ్చిందని గీత వివరించారు. పత్తి కొనుగోళ్లతో సీసీఐ నుంచి రూ.1.9కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే వడ్ల కొనుగోళ్లతో పౌరసరఫరాల శాఖ ద్వారా రూ.34లక్షలు, పంట ఉత్పత్తుల లావాదేవీలతో మిల్లర్లు, కొనుగోలుదారుల ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరిందని చైర్‌పర్సన్ చెప్పారు. పత్తి అమ్మకాలపై ఎక్కువ ఆదాయమొచ్చిందన్నారు. జీరో వ్యాపారానికి తావులేకుండా మార్కెట్ ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అగ్రికల్చర్ చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. మార్కెట్ ఆదాయం పెంపునకు రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. తమ పంట ఉత్పత్తులను యార్డ్‌లోనే విక్రయించాలని కోరారు. యార్డ్‌లో రైతులకు మెరుగైన వసతుల కల్పించేలా ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో కార్యాచరణ రూపొందించామని గీత వెల్లడించారు. సమావేశంలో ఏఎంసీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, డైరెక్టర్లు కండె పాండురంగయ్య, పి.శ్రీశైలం, అజీం, నరేశ్‌నాయక్, కేశవరెడ్డి, అంజయ్య, జంగయ్య, యాదయ్య, రమేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, రవీందర్, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

దోమ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో సోమవారం రంజాన్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. చేతులకు నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నినాదాలు చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్ బిల్లులో కొత్త చట్టం కాకుండా ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నజీమ్, మహమూద్, బాగ్దాద్, ఖాజ, సాదీక్, రఫూఫ్, మహ్మద్ షఫీ, గౌస్, షేర్‌ఖాన్, కలీం ఖాన్, అక్రమ్‌ఖాన్, ఫరీద్‌పాషా, మొయిజ్, ఫిరోజ్ పాషా, ఇంతియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.



దగ్ధమైన హోటల్‌ను పరిశీలిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

అధైర్యపడొద్దు .. అండగా ఉంటాం

ఆమనగల్లు, మార్చి31(ఆంధ్రజ్యోతి): బాధితులు అధైర్య పడొద్దని, వారికి అండగా ఉంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి వద్ద ప్రమాదవశాత్తు కాలిపోయిన చైత్ర రెస్టారెంట్‌ను సోమవారం శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తినష్టంపై అడిగి తెలుసుకున్నారు. ర.5లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు శ్రీను చెప్పాడు. పరామర్శించిన వారిలో నాయకులు పత్యానాయక్, పరమేశ్, రమేశ్‌గౌడ్, రమేశ్, సయ్యద్ ఖలీల్ ఉన్నారు.

ఆలయంలో ఘనంగా పడిపూజ

నందిగామ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నందిగామలో ఆదివారం రాత్రి అయ్యప్ప ఆలయంలో గురుస్వామి గిరీషన్‌నాయర్ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, ఇతర పూజలు చేశారు. ఆలయంలో పడి వందనాన్ని సిద్ధాపూర్ శేఖర్‌రెడ్డి వెలిగించారు. పూజలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నందిగామ మాజీ సర్పంచ్ క్రిష్ణ భక్తులకు అల్పాహారం నిర్వహించారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గణేష్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నారయణరెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గూడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పనులు

మెరుగవనున్న వైద్య సేవలు.. రూ. 17.5కోట్లతో ఆస్పత్రి నిర్మాణం

అక్టోబరు నాటికి వినియోగంలోకి కొత్త భవనం



ఆమనగల్లులో కొనసాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

ఆమనగల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పతి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అక్టోబరు కల్లా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. 50ఏళ్ల కింద నిర్మించిన ఆమనగల్లు ఆస్పత్రి భవనం శిథిలమైంది. రోగులకు, వైద్య సిబ్బందికి వసతుల్లేక ఇబ్బందులు పడ్డారు. కొత్త భవనం నిర్మించాలని మండల వాసులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. 2023 ఆగస్టు 18న నూతన భవన నిర్మాణానికి వైద్యవిధాన పరిషత్ నుంచి రూ.17.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. టెండర్లు పూర్తయినా నిధులు రాక పనులు ప్రారంభించలేదు. నూతన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు విడుదల చేయించి 2024 జూలై 10న మరోసారి శంకుస్థాపన చేశారు. పాత భవనాన్ని కూల్చి బిల్డింగ్ పనులు ప్రారంభించారు. తలపెట్టిన మూడు ఫ్లోర్‌లకు మొదటి అంతస్తు పూర్తయ్యింది. రెండో అంతస్తు పనులు చేస్తున్నారు. ఎస్ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ అబ్దుల్ అజీజ్, డీఈ రవీందర్‌ల పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. మూడు ఫ్లోర్‌లతో 45వేల ఎస్ఎఫ్టీ వైశాల్యంతో భవనాన్ని నిర్మిస్తున్నారు. కట్టడానికి రూ.12కోట్లు, ఆస్పత్రి సామగ్రికి రూ.5.5కోట్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. గడువులోగా పనులు పూర్తి చేస్తామన్నారు.

తొలగనున్న ఇబ్బందులు



ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి నూతన భవనంతో రోగులకు ఇబ్బందులు తొలగుతాయి. మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో నిధులు విడుదలయ్యాయి. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

\- బాబ, ఆమనగల్లు

నిర్ణీత గడువులోపు పూర్తి



ఆస్పత్రి భవన నిర్మాణాన్ని గడువులోపు పూర్తి చేస్తాం. పనులు వేగంగా చేస్తున్నాం. అక్టోబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాం. మూడంతస్తులకు ఇప్పటికే మొదటి అంతస్తు పూర్తైంది. మరో పది రోజుల్లో రెండో అంతస్తు నిర్మాణం జరుగుతుంది.

\- రవీందర్, డీఈ, ఆమనగల్లు

అక్రమ క్రషింగ్

- అల్లాపూర్‌లో క్రషర్ మిషన్ నిర్వహణ
- నామమాత్ర పన్నుతో ఏళ్లుగా కొనసాగింపు
- అనుమతిలేకుండా కొత్త భవన పనులు
- కన్నెత్తి చూడని అధికారులు



అల్లాపూర్‌లో కొనసాగుతున్న క్రషింగ్ మిషన్

తాండూరు రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అల్లాపూర్ పంచాయతీకి ఓ క్రషర్ వ్యాపారి గండి కొడుతున్నారు. అల్లాపూర్‌లో రెండేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకుండా క్రషర్ నడుపుతున్నారు. అలాగే అనుమతులు తీసుకోకుండానే కొత్తగా మరో కర్మాగార నిర్మాణానికి పనులు చేస్తున్నాడు. అయినా పంచాయతీ కార్యదర్శి ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. రోజూ రోడ్డుకు ఇరువైపులా నాపరాతి ముక్కల వ్యర్థాలను పడేయడం, ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో నాపరాతిని తరలించి డస్ట్ తయారు చేసి విక్రయించడం వంటివి చేస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ఇక్కడి నుంచే నాసిరకమైన డస్ట్‌ను తీసుకెళ్లి ఉపయోగిస్తున్నారు. దీంతో పనుల్లో నాణ్యత లేకుండా పోతోంది. ఇసుక వాడాల్సిన చోట సాండ్ డస్ట్‌ను వాడుతున్నారు. కొన్ని రోజులకే పనులు బీటలు వారుతున్నాయి. క్రషర్ యజమాని నిత్యం డస్ట్ తయారు చేసి విక్రయిస్తున్నాడు. శాఖ కూడా ట్యాక్సులు కట్టడం లేదు. అసలు ఇక్కడ మైనింగ్ చేస్తున్నట్టు శాఖకు సమాచారం ఉందా? అనేది కూడా అనుమానంగా ఉంది. ఇంత పెద్ద ఎత్తున క్రషర్ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారి అల్లాపూర్ పంచాయతీకి ఏడాదికి రూ.5వేలు మాత్రమే చెల్లిస్తూ పన్నుకు గండి కొడుతున్నాడు. ఆస్తిపన్ను రూపేణా ప్రజల నుంచి ఇంటి పన్ను రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్న అధికారులు.. క్రషర్ వ్యాపారి ఏటా కేవలం రూ.5వేలు చెల్లిస్తున్నా చర్యలెందుకు తీసుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. రెండేళ్లపాటు పంచాయతీకి ఆస్తిపన్ను కట్టలేదు. ఇదిలా ఉంటే పక్కనే వ్యవసాయ భూమిలో మరో క్రషర్ నిర్మాణానికి పిల్లర్లు వేశారు. అల్లాపూర్‌లో వ్యవసాయ భూముల్లో పెద్దఎత్తున స్టోన్ యూనిట్లు నిర్మిస్తున్నా రెవెన్యూ పంచాయతీ, మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ, గనుల శాఖకు పన్నులు చెల్లించకుండా కొనసాగిస్తున్న క్రషర్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



మరో కర్మాగార నిర్మాణానికి వేసిన పిల్లర్లు

పర్యటించి చర్యలు తీసుకుంటాం

అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి భవానీ ధారూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కరుణాకర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించాం. ఆయన కూడా ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. క్రషర్ యజమాని రెండేళ్లుగా పంచాయతీకి ట్యాక్సు కట్టలేదని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై కార్యదర్శులతో క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటాం. అక్రమమని తేలితే రెండేళ్ల ట్యాక్సు వసూలుతో పాటు భారీ ఎత్తున జరిమానా విధిస్తాం.



\- విశ్వప్రసాద్, ఎంపీడీవో



భలే ఐడియా!

కోతుల బెడద నివారణకు కొండెంగల ఫొటోలు

చాలా చోట్ల పొలాల్లో పంటలను కోతులు పాడు చేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు మామిడి తోటలపైనా పడి కాయలన్నీ రాలేలా చేస్తున్నాయి. తినేది తక్కువే అయినా కోతుల దుంకుడుకు మామిడి కాయలు రాలుతున్నాయి. గుంపులుగా చెట్లు ఎక్కి తోటలను నాశనం చేస్తున్నాయి. యాచారంలోని మొండిగౌరెల్లి రోడ్డులో ఉన్న మల్లారెడ్డి మామిడి తోటలోకి కోతులు ఎగబడుతున్నాయి. కాయలన్నీ కొరికి పారేస్తున్నాయి. దీంతో కోతులను తరిమేందుకు రైతు పెద్ద పెద్ద కొండెంగల ఫ్లెక్సీలను చెట్లకు కట్టారు. ఆ ఫొటోలు చూసి కోతులు పారిపోతున్నాయని రైతు చెప్పారు.

\- యాచారం, మార్చి 31(ఆంధ్రజ్యోతి)


తాండూరు: ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


తాండూరు: శుభాకాంక్షలు చెబుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి


వికారాబాద్: ఎన్నెపల్లిలో శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


దుద్యాల: ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- కిక్కిరిసిన ఈద్గా మైదానాలు
- ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

ముస్లింల పవిత్ర పండుగైన రంజాన్‌ను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షల అనంతరం సోమవారం ఈద్ ఉల్ ఫితర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాలలో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్త బట్టలు ధరించిన ముస్లింలు ఉదయమే ఈద్గాలు, మసీద్‌ల వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి 31


ఘట్‌కేసర్: రంజాన్ వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్


పూడూరు: కంకల్‌లో శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు


కొడంగల్‌లో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి


కీసర రూరల్: నాగారంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


కీసర రూరల్: కీసర మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


నవాబుపేట: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు


వికారాబాద్: చిన్నారుల ఆలింగనం


కొడంగల్ రూరల్: చిన్నారుల శుభాకాంక్షలు


పెద్దేముల్‌లో ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


దోమ: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


పరిగి: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

తెగిపడిన విద్యుత్ తీగ

ధారూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ధారూరులోని కూరగాయల మార్కెట్ రోడ్డు మార్గంలో సోమవారం విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ తీగ తెగిపడింది. తీగ కిందపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల వారు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాలం చెల్లిన విద్యుత్ తీగలను మర్చాలని ప్రజలు కోరుతున్నారు.


ధారూరులో తెగిపడిన విద్యుత్ తీగ

తాగునీటి పైప్‌లైన్‌లో చెట్ల వేర్లు

నవాబుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండలంలోని పూలపల్లి గ్రామంలో తాగునీటి సరఫరా కోసం వేసిన పైపలైన్‌లో చెట్ల వేర్లు చొచ్చుకుపోయాయి. దీంతో నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి భానుప్రసాద్, వాటర్‌మెన్ బాలయ్య, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి గ్రామస్థుల సహకారంతో తాగునీటి సమస్యను పరిష్కరించారు.



వీరశైవ సమాజం నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులు

కోట్‌పల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీరశైవ సమాజం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గందే సురేష్, అధ్యక్షుడిగా సంగమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా నల్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా సునీల్‌దొర, సహాయ కార్యదర్శిగా నిఖిల్, కోశాధికారిగా పత్తి అమర్‌నాథ్, సలహాదారుగా గందే చిత్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరశైవ సమాజాభివృద్ధికి తోడ్పడతామని పేర్కొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జాతర

కొడంగల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణ శివారులో వెలిసిన శ్రీ నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా జల్లిబిందె, పంచామృత అభిషేకం, భజనలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అన్నదాన కార్యక్రమం, ఈ నెల 2న పెరుగు బసంతం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఓటు నమోదుకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

అధికార యంత్రాంగం పలు చర్యలు తీసుకుంటోంది. పోలింగ్ నిర్వహణ సాఫీగా కొనసాగాలంటే ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా రూపొందించడం ఎంతో ముఖ్యమనేది అందరికీ తెలిసిందే. పకడ్బందీగా ఓటర్ల జాబితా తయారీ అనేది ఎన్నికల సంఘానికి సవాల్‌గా మారుతోంది. జాబితాలో మార్పులు, చేర్పులు, తప్పులు సరిచేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నా.. పూర్తి స్థాయిలో బోగస్ ఓట్లను నిరోధించలేకపోతోంది. బోగస్ ఓట్లకు చెక్ పెట్టేందుకు, ఇతర అక్రమాలకు చెక్ చెట్టేందుకు ఆధార్ అనుసంధానమే ఉత్తమ మార్గమని గుర్తించిన ఎన్నికల సంఘం ఆ దిశగా చర్యలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపడితేనే బోగస్ ఓట్లు, డబుల్ ఓటర్లు లేకుండా చర్యలు తీసుకుంటోంది. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.


రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్(ఫైల్)

ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఓటరు నమోదుపై ఇప్పటికే కలెక్టర్ గౌతమ్ జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సరళీకృత ఓటరు జాబితాలను అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ ఆ వివరాలను బీఎల్‌వోలు ఓటర్లకు తెలియజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు వేరే వేరు బూత్‌లలో ఓటరు నమోదు ఉన్నట్లయితే వారు ఫామ్-8లో బూత్ మార్పునకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



జిల్లాలో ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు నమోదు చేసుకోవాలి. బీఎల్‌వోల వద్ద దరఖాస్తు ఫారం-6 అందుబాటులో ఉన్నాయి. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, మొబైల్ ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. మార్పులు, చేర్పులకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

- లింగ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్, వికారాబాద్

వికారాబాద్ జిల్లా ఓటర్లు (2025, జనవరి 6వరకు)

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	సర్వీస్ ఓటర్లు
పరిగి	1,35,522	1,35,528	10	247
వికారాబాద్	1,16,388	1,18,524	21	79
తాండూరు	1,19,824	1,27,952	07	53
కొడంగల్	1,20,879	1,25,640	07	170
మొత్తం	4,92,613	5,07,644	45	549

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	సర్వీస్ ఓటర్లు
మేడ్చల్	3,43,299	3,29,017	60	2,063
మల్కాజిగిరి	2,57,578	2,55,522	14	1,143
కుత్బుల్లాపూర్	3,82,611	3,51,274	166	2,534
కూకట్‌పల్లి	2,53,218	2,32,703	128	910
ఉప్పల్	2,80,669	2,62,230	48	964
మొత్తం	15,17,375	14,30,746	416	7,614

నిరుపయోగంగా వైకుంఠధామాలు



మైల్వార్‌లో నిరుపయోగంగా శ్మశానవాటిక

రూ.లక్షల్లో ప్రజాధనం వృథా!

పట్టించుకోని అధికారులు

బషీరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన శ్మశానవాటికలు వృథాగా దర్శనమిస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో గ్రామ గ్రామాన వైకుంఠధామాలు నిర్మించింది. పలు గ్రామాల్లో అసైన్డ్ భూములను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఒక్కో గ్రామంలో రూ.13 లక్షలు వెచ్చించి శ్మశానవాటికలు నిర్మించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపట్టారు.

36 గ్రామ పంచాయతీల్లో..

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీల్లో రూ.కోట్లతో శ్మశానవాటికలను నిర్మించారు. అయితే ప్రజలు మాత్రం ఎక్కడా వీటిని వినియోగించడం లేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్మశానవాటికలను వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉంది.

చకచకా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం!

(5వ పేజీ తరువాయి)

308 ఇళ్లను మంజూరు చేసింది. ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్‌లో 70, కీసర మండలం భోగారంలో 33, శామీర్‌పేట మండలం పొన్నాలలో 80, మూడుచింతలపల్లి మండలం కేశవరంలో 101, మేడ్చల్ మండలం సోమారం గ్రామంలో 24 ఇళ్ల చొప్పున మంజూరు చేశారు. ఇందులో 102 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం వీరు ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కొన్ని పునాదుల స్థాయిలో, మరికొన్ని బేస్మెంట్ స్థాయిల్లో ఉన్నాయి. అధికారులు కూడా ప్రభుత్వ ఆదేశాల మేరక ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచిస్తున్నారు.

నాలుగు దఫాల్లో బిల్లులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం లబ్ధిదారులకు నాలుగు దఫాల్లో బిల్లులు చెల్లించనుంది. పునాది స్థాయిలో ఒకసారి, గోడల నిర్మాణ స్థాయిలో రెండోసారి, స్లాబ్ వేసిన తర్వాత మూడోసారి, ఇల్లు పూర్తిగా నిర్మాణం అయిన తర్వాత నాలుగోసారి బిల్లులు చెల్లిస్తారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించనున్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుంది.

వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కొడంగల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి భజన మండలి కొడంగల్, శంకర కంటి నానక్‌రామ్‌గూడ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అక్షర హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 59 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 26 మందికి కంటి శుక్లాల లోపాలు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సత్యసాయి భజన మండలి సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హనుమాన్‌గండిలో భారీ చోరీ

పరిగి, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పరిగి మండలం హనుమాన్ గండితండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన ముడావద్ శ్రీనివాస్‌నాయక్‌తోపాటు భార్య పిల్లలు ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి ఇంటిపై నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి తొమ్మిది తులాల బంగారం, అరకిలో వెండి, రూ.60 వేలు ఎత్తుకెళ్లారు. దాదాపు రూ.10లక్షలు విలువ చేసే వస్తువులు పోయాయని బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తెరిచి ఉన్న బీరువా